కర్నూలు | నంద్యాల
వార్త
12 సెప్టెంబర్ 2025 శుక్రవారం పేజీలు 4

## టిడిపి హయాంలోనే సమగ్ర అభివృద్ధి : మంత్రి ఎన్ఎండి.ఫరూక్

: రూ.1.40కోట్లతో నిర్మించిన పద్మావతినగర్ రోడ్డు ప్రారంభం

**నంద్యాల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ప్రతినిధి**

నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో రూ.1.40కోట్ల నిధులతో నిర్మాణం పూర్తి చేసిన రెండు వరుసల సిసిరోడ్డును రాష్ట్రన్యాయ,మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి, నంద్యాల ఎంఎల్‌ఏ ఎన్ఎండి.ఫరూక్‌ప్రారంభించారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలోనిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండి.ఫరూక్ పద్మావతి నగర్‌రోడ్డుకు రిబ్బన్‌కట్‌చేసి గురువారం ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధి టిడిపి ప్రభుత్వ హయాంలోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ కేవలం ఒక ఏడాదిలోపే పద్మావతినగర్‌రోడ్డు నిర్మాణాన్ని



రూ.1.40కోట్ల రూపాయల నిధులతో పూర్తి చేయగలిగామన్నారు. గతంలో చిన్నవర్షానికే మురికినీరు చేరి ప్రజలకు ఇబ్బందులు కలిగేవన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఆ సమస్య శాశ్వతంగా పరిష్కరించడిందని తెలిపారు. రాబోయే రోజుల్లో రూ.40లక్షల నిధులతో డివైడర్, సుందరీకరణ పనులు చేపడతామన్నారు. సంజీవనగర్ గేటు నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు కొత్త సిసి రోడ్డు నిర్మాణంలో త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. నంద్యాలలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు తాగునీటి కష్టాలు తలెత్తకుండ సమ్మర్‌స్టోరేజి ట్యాంక్2 నిర్మాణానికి ప్రణాళికలు సిద్దం చేసి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు అందజేశామన్నారు. అనంతరం పద్మావతి నగర్‌రోడ్డు నిర్మాణాన్ని అతి తక్కువ సమయంలో పూర్తిచేసిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దూదేకుల జైనాబీ, శ్రీదేవి, టిడిపి నాయకులు ఎన్ఎండి.ఫయాజ్, పట్టణ అధ్యక్షులు మనియార్‌ఖలీల్, నరహరివిశ్వనాథరెడ్డి, వార్డు ఇంచార్జి మధసాయి, నంద్యాల ఆర్‌డిఓ విశ్వనాథ్, మున్సిపల్ కమీషనర్ జయన్న,మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం

: మంత్రి టి.జి. భరత్

**కర్నూల్ హాస్పిటల్ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు తప్పక కల్పిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ స్పష్టం చేశారు. అమరావతిలోని సచివాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, పరిశ్రమల భూకేటాయింపులపై వస్తున్న తప్పుడు కథనాలపై వివరణ ఇచ్చారు.ఏపీఐఐసీ ద్వారా భూములు కేటాయింపులు పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని ఆయన అన్నారు. అసత్య వార్తలు రాసినా రాష్ట్ర అభివృద్ధి అడ్డుకోలేరని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారని ఆయన తెలిపారు. గత 15 నెలల్లోనే రూ. 11 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని పేర్కొన్నారు.ఇఫ్కో కిసాన్ వంటి కోఆపరేటివ్ సొసైటీలు, హెచ్.ఎఫ్.సి.ఎల్, అలీప్, వరాహ్ అక్వా ఫార్మ్స్, జె కుమార్ ఇన్‌ఫ్రా వంటి కంపెనీలకు భూకేటాయింపుల విషయంలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని భరత్ తెలిపారు. ఇఫ్కో ప్రాజెక్ట్ ద్వారానే 70 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. హెచ్.ఎఫ్.సి.ఎల్ ప్రాజెక్ట్ వల్ల రాయలసీమలో వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు.తప్పుడు వార్తలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని మంత్రి తీవ్రంగా విమర్శించారు. ఒక పత్రిక, ఛానల్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు వాస్తవాలు తెలుసుకొని ప్రజలకు ఉపయోగపడే వార్తలు రాయాలని సూచించారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాను అభివృద్ధి చేసేందుకు తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రగతిశీల ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే తమ లక్ష్యమని మంత్రి టి.జి. భరత్ స్పష్టం చేశారు.



# పోలీసులు చట్టానికి.. అతీతులా..!



- దోపిడీ కేసులో నిందితులకు జైలు
- పోలీసులకు సస్పెన్షన్ మాత్రమే...
- ఉన్నతాధికారుల పక్షపాత వైఖరి

**మేం పోలీసులం.. చట్టం మాకు వర్తించదు.. మేము ఏమైనా చేస్తాం.. ఎవరినైనా కొడతాం.. ఎవరినైనా బెదిరిస్తాం.. ఎవరినైనా దోచుకుంటాం.. అంటూ కొందరు పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వారిని అరికట్టాల్సిన అధికారులు సైతం మా పోలీసులే... చట్టంలో మినహాయింపులు ఉంటాయి.. అనే చందంగా వారికి శిక్షలు వేయడంలో పక్షపాత ధోరణి చూపుతున్నారు. అసలు చట్టాన్ని రక్షించాల్సిన వాళ్లే.. చట్టాన్ని మితిమీరితే.. వారికి మరింత కఠిన శిక్షలు వేయాల్సి ఉంటుంది.. కానీ ఇక్కడ మాత్రం ఉన్నతాధికారులు నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. దొంగలు పోలీసులు కలిసి ఒకే నేరం చేస్తే.. దొంగలకు జైలు శిక్ష, పోలీసులకు సస్పెన్షన్ మాత్రమే..!**

**కర్నూలు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

కర్నూలు నగర పరిధిలో ఈ మధ్యకాలంలో ఇద్దరు కానిస్టేబుల్ లను, ఒక హోంగార్డును పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ మేరకు కర్నూలు నాలుగవ పట్టణ పోలీసులు ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు. నేరం జరిగిన సమాచారాన్ని ఇవ్వకపోవడంతో .. సదరు పోలీసులను, హోంగార్డును సస్పెండ్ చేసినట్లు వివరించారు. ఈ విషయం మీడియాలో వచ్చింది. అయితే ఈ విషయంలో స్పష్టత లేకపోవడంతో భిన్న రకాల చర్చలు జరిగాయి. కొందరు పోలీసుల సస్పెన్షన్ను సమర్థించగా.. మరి కొందరు సానుభూతి వ్యక్తం చేశారు. అయితే ఈ విషయం తెలిసిన చాలా మంది మాత్రం పోలీసు ఉన్నతాధికారుల చర్యలను తీవ్రంగా



విమర్శించారు. అందుకు కారణం సదరు పోలీసుల పై తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయమే.. అవును సదరు పోలీసులను అరెస్టు చేసే రిమాండ్ పంపాల్సి ఉండగా... పోలీసు ఉన్నతాధికారులు మాత్రం కేవలం సస్పెన్షన్ తో సరిపెట్టారు. ఇది తీవ్ర విమర్శలకు కారణమైంది. కర్నూలు నగరంలో మెట్రో సిటీ కల్చర్ వస్తుంది. అందులో భాగంగా యువత నగర శివారులకు వెళ్లి ప్రేమించుకోవడం, లేదా ప్రశాంత వాతావరణ ఆస్వాదించడం, అది కాదంటే అక్కడికి వెళ్లి ఏకాంతంగా కూర్చోవడం.. లాంటి పనులు చేస్తున్నారు. అందుకు జగన్నాథ గట్టు, కాదంబరీ వెంచర్ వెంకన్న బావి తదితర నగర శివారు ప్రాంతాలు వేదికగా మారాయి. ఆ ప్రాంతాలలో ప్రేమ పక్షుల తో పాటు, సాధారణ జనం కూడా అప్పుడప్పుడు వెళ్తూ ఉంటారు. అయితే అక్కడికి వచ్చే ప్రేమ పక్షులే టార్గెట్ గా.. దోచుకునేందుకు ఒక ముఠా ఉంది. ఆ ముఠా అక్కడికి వచ్చే ప్రేమికులను వారికి తెలియకుండా వీడియోలో చిత్రీకరిస్తారు. తర్వాత సదరు వీడియోలను చూపించి.. వారిని బ్లాక్ మెయిల్ చేస్తారు. ప్రేమికులనైతే తల్లిదండ్రులకు చెబుతామంటూ బెదిరిస్తారు. అంతకు మించి నా ఆశ్లీలత చోటు చేసుకుంటే సదరు వీడియోలు ఇంటర్నెట్లో పోస్ట్ చేస్తానంటూ బెదిరిస్తారు. ఇలా ఆ జంట దగ్గర ఉన్న బంగారు ఆభరణాలతో పాటు డబ్బు.. ఇంకా కుదిరితే వారి నుంచి తర్వాత కూడా డబ్బు వసూలు చేస్తారు. ఈ విధంగా ఒకే ముఠా గడచిన 10 నుంచి 12 సంవత్సరాల నుంచి ఈ దోపిడీ చేస్తుంది. మరి ఆయా ప్రాంతాలలో గస్తీ కాసే పోలీసులకు తెలియదా.. ఇన్ని సంవత్సరాలైనా పోలీసుల దృష్టికి ఆ విషయాలు రాలేదా.. అంటే కచ్చితంగా ఆ విషయాలు పోలీసుల దృష్టికి వచ్చాయని చెప్పవచ్చు. మరి పోలీసులు ఏం చేశారు.. ప్రేమికులను దోచుకుంటున్న దొంగలను అరెస్టు చేసి, అలాంటి దోపిడీ వ్యవహారాలు జరగకుండా అరికట్టాల్సిన పోలీసులు.. సదరు దొంగలతో చేతులు కలిపారు. ఇంకేముంది దొంగలు పోలీసులు కలిసికట్టుగా దోచుకోవడం ప్రారంభించారు. అలా ఒకరు.. ఇద్దరు కాదు ఎంతమందినో దోచుకున్నారు. ఆయా ప్రాంతాలకు వచ్చే జంటలే టార్గెట్గా వారిని దోచుకుంటూ ఉన్నారు. పాపం పండింది.. చివరకు ఓ మహిళ ధైర్యం చేసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసు ఉన్నతాధికారులు సదరు ముఠాను పట్టుకున్నారు. విచారణలో పోలీసుల పాత్ర వెలుగులోకి వచ్చింది.. అంతేగాక అందుకు సంబంధించి కొన్ని వీడియో సాక్షాలు...

• వివరాలు 2లో

## వైద్యం వికటించి నిండు గర్భిణీ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆందోళన
- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల డిమాండ్



**మంత్రాలయం, సెప్టెంబరు11, ప్రభాతవార్త;**

మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన ఓ నిండు గర్భిణీకి వైద్యం వికటించడంతో గురువారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల మేరకు... గ్రామానికి చెందిన కురువ చంద్రప్ప, వీరనాగమ్మల కుమార్తె కురువ లింగమ్మ(22) అనే యువతిని చిన్నపెండేకల్లు గ్రామానికి చెందిన శ్రీనివాసులకు ఇచ్చి వివాహం జరిపించారు. మొదటి సంతానంగా ఈమెకు ఓ కుమారుడు ఉన్నాడు. అయితే మహిళ రెండో కాన్పుకు గర్భవతిగా ఉంది. గర్భిణీ మహిళను కాన్పు నిమిత్తం ఎమ్మిగనూరులోని గౌడప్పగౌడ ఆసుపత్రికి వెళ్లారు. గర్భిణీకి సీజేరియన్ చేయడానికి గర్భిణీ మహిళకు మత్తు ఇంజక్షన్ వేసిన వెంటనే గర్భిణీ మహిళ మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భిణీ మృతిచెందిందని ఆందోళన చేపట్టారు.

## కర్నూలు జిల్లా కలెక్టర్ గా డాక్టర్ ఏ సిరి

: కలెక్టర్ రంజిత్ కుమార్ జీఏడీకి బదిలీ



**కర్నూలు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

కర్నూలు జిల్లాకు నూతన కలెక్టర్ గా డాక్టర్ ఏ సిరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో పనిచేసిన కలెక్టర్ రంజిత్ కుమార్ ను జిఏడికి బదిలీ చేసింది. ఆ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. కర్నూలు జిల్లాకు బదిలీపై వస్తున్న డాక్టర్ సిరి శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. విశాఖపట్నంలో ఎంబిబిఎస్ చదివారు. గతంలో ఆమె అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ గా పని చేశారు. తర్వాత చైల్డ్ వెల్ఫేర్ విభాగంలో డైరెక్టర్ గా పని చేశారు. ఆ తర్వాత గ్రామ సచివాలయాల విభాగంలో స్పెషల్ కమిషనర్ గా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. తర్వాత ఏపీ శాక్స్ లో డైరెక్టర్ గా పనిచేశారు. ప్రస్తుతం సెకండరీ హెల్త్ విభాగంలో డైరెక్టర్ గా ఉన్నారు. ఆమెను ప్రస్తుతం కర్నూలు జిల్లా కలెక్టర్ గా నియమించారు. ఎక్కడ పనిచేసిన తనకంటూ ప్రత్యేక గుర్తింపును పొందడం ఆమె నైజం. కాగా జిల్లాకు మహిళా కలెక్టర్ రావడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.


## కుండ పోత వర్షం.. నీట మునిగిన పంటలు..!

: చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
: జలదిగ్బంధములో గ్రామాలు
: రాక పోకలు కట్
: నంద్యాలజిల్లాలో 892.6యంయం
: కొలిమిగుండ్ల అత్యదికముగా 128.2యంయం
: అత్మకూరు,కొత్తపల్లెలో చుక్క పడని వర్షము



**నంద్యాల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ప్రతినిధి**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారంసాయంత్రం నుండి కుండ పోతగా వర్షము కురుస్తునే ఉంది. దీనితో పంట పొలాలు చెరువును తలపిస్తున్నారు. పొలాల్లో ఎటుచూసిన వర్షము నీరే కనిపిస్తుంది.ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసి పంటలు నీట మునిగారు. ఉద్యాన వన పంటలైన నిమ్మ జామ పంటల్లో వర్షము నీరునిల్వ ఉండటము చెట్లు రంగు మారుతుతున్నారు. అలాగే రైతులు కెసి, యస్‌అర్‌బిసి, కుందూ, తెలుగుగంగ మీ దఅదార పడి సాగుచేసిన వరి పత్తి, మొక్క జొన్న మినుము, కంది. పంటు నీటమునిగాయి.ఇక రబీ కోసం ఏర్పాటు చేసున్న పొలాలల్లో ఎటు చూసిన వర్షపు నీరు చెలేరులను తలపిస్తుంది. ఇప్పటికే పొలాల్లో నీటి శాతము అదికమై కలుపు మొక్కలు అదికము కావడముతో రైతులు వాటిని తొలగించడానికి నానా తంటాలు పడుతున్నారు. దీనికి తోడు బుదవారము నుండి వర్షము ఏకదాటిగా పడుతుండటము ఇక రబీ కష్టమే అనే రీతిలో రైతులు అందోళన చెందుతున్నారు. ఇక కుండ పోవ వర్షానిక కుందూ నది ఉగ్రరూపము దాల్చుతునే ఉంది. నిన్న మొన్నటి వరకు సోమశీల దెబ్బతో విల విలాడిన కుందూ పరివాహ గ్రామాలు ఈవర్షము మరింత ఇబ్బందులు పడుతున్నాయి.ముఖ్యంగా కోవెలకుంట్ల మండలంలోని వల్లంపాడు, సోమశీల దెబ్బకు పంటలు నీట మునగడమే కాకుండా పొలాుల ఇసుక మేర వేశాయి. ఈవర్షము అ మేటు మరింత అదికము కానున్నాయి. చేతికి అందివచ్చే మొక్క జొన్న పంట వర్షం దాటికి పూర్తిగా దెబ్బతిన్నది. బుదవారము నుండి గురువారము కురుస్తున్న వర్షము వివరాలోకి వెళ్లితే కోవెలకుంట్ల మండలంలో 50యంయం, సంజామల మండలంలోని 30యంయం, పాణ్యంలో 25యంయం, శ్రీశైలం 20యంయందొర్నిపాడు 19.20యంయం,రుద్రవరము 17.12యంయం, బేతంచెర్ల 16యంయం, మహానంది 15యంయం, కొలిమిగుండంలో అత్యదికముగా 128.4 యంయం, పడి రాకార్డు సృష్టించింది,. అలాగే అవుకు మండలంలోని 67యంయం, ప్యాపిలిలో 66యంయం, అళ్లగడ్డలో 60.4యంయం, నంద్యాల అర్బన్‌లో 59యంయం, బండిఅత్మకూరులో 56.2యంయం, నంద్యాల రూరల్‌లో 55.2యంయం, చాగలమర్రిలో 52.2యంయం, గోస్పాడులో 43యంయం,ఉయ్యాలవాడలో 32.4యంయం, బనగానపల్లెలో 30.00యంయం వర్షం కురిసింది.దీనితోపంట పొలాలకు బారీగా నష్టము వాటిల్లింది. పంటలు పూర్తిగ దెబ్బతిన్నాయి.



## కన్న కొడుకునుచంపిన.. కసాయి తండ్రి..!

- ఇనుపరాడుతో భార్యపై దాడి.. పరిస్థితి విషమం
- నిందితుడిని అప్పగించాలని రహదారిపై రాస్తారోకో
- రెండుగంటలసేపు స్తంభించిన వాహనాలు







**దేవనకొండ, సెప్టెంబరు11, ప్రభాతవార్త;**

కంటికి రెప్పలా కాపాడాల్సిన ఓ తండ్రి 8 నెలల కన్న కొడుకును నీటి డ్రమ్ములో ముంచి హత్య చేసి తోడునీడ ఉండాల్సిన భార్యపై విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలకేంద్రమైన దేవనకొండ గ్రామానికి చెందిన చాకలి నరేష్ వెలమకూరు రెవెన్యూ పరిధిలోని సొంత పొలంలో ఉన్న గదిలో అవ్వ, తాతతో గత 10 రోజుల నుంచి భార్య శ్రావణి, కుమారుడు సాగర్‌తో కలిసి ఉన్నాడు. అయితే గురువారం ఉదయం 10 గంటల సమయంలో భార్య శ్రావణిపై ఇనుపరాడుతో విచక్షనారహితంగా దాడి చేయడంతో రక్తపు మడుగులో పడింది. 8 నెలల కుమారుడు సాగర్‌ను నీటి డ్రమ్ములో ముంచి చంపేశాడు. ఈ సంఘటనను చూసిన నిందితుని అవ్వ, తాత పోలీసులకు సమాచారం తెలపడంతో రక్తపు మడుగులో పడిన శ్రావణిని అంబులెన్స్ లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న శ్రావణి పుట్టినిల్లు గొనెగండ్ల మండలం కులుమాల గ్రామం నుంచి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో వచ్చి పత్తికొండ-దేవనకొండ రహదారిపై బాలుడి మృతదేహంతో బైఠాయించారు. దీంతో 2 గంటలసేపు ట్రాఫిక్ స్తంభించింది. నిందితుడు నరేష్, తల్లిదండ్రులను, మేనత్తను అప్పగించాలని డిమాండ్ చేశారు. బాలుడు మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోధనలు చూపరులను కలిసివేసింది. అయితే గత మూడేళ్ల క్రితం మొదటి భార్యను కూడా నిందితుడు నరేష్ హత్య చేశాడని, తమకు న్యాయం జరగకపోతే పోలీస్‌స్టేషన్ ఎదుటే పెట్రోలు పోసుకుని నిప్పు పెట్టుకుంటామని శ్రావణి కుటుంబ సభ్యులు పోలీసులను హెచ్చరించారు. బాధితా కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని సీఐ వంశీనాథ్ హామీ ఇవ్వడంతో సాగర్ మృతదేహాన్ని పత్తికొడ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించాఉ. నరేష్ భార్య శ్రావణి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పచ్చ జెండా ఊపిన.. ఎన్నికల కమీషన్

- పోరుకు సిద్ధమైన రాజకీయ పార్టీలు
- అందరి దృష్టి కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీపైనే .!
- కొత్త వారి .. అరంగ్రేటంతో.. ప్రస్తానం.!

**మరో మూడు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషన్ పచ్చజెండా ఊపడంతో అందరి దృష్టి స్థానిక ఎన్నికలపైనే కేంద్రీకరించడంలో నిమగ్నమయ్యారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి ఇంకా మూడు నెలల కాలం ఉందన్న విషయం తెలిసిందే. అయితే స్థానిక సంస్థలకు పొందుపర్చిన చట్టం 1955 ప్రకారం పంచాయతీ స్థానాలకు గడువు ముగియక పోయినా ముందుగా నిర్వహించుకునే అధికారాలను రూపొందించడంతో ఆ ప్రకారంగా గ్రామ పరిపాలన దృష్ట్యా గడువుకు ముందుగానే ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల అధికారులు సూచనలు చేయడంతో ఆ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికలకు వెళ్లేందుకు సమాలోచనలు తెలుస్తోంది. అదే జరిగితే రానున్న మూడు నెలల్లో స్థానిక పోరుకు సిద్ధమయ్యే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.**




**కోడుమూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త ః**

స్థానిక సంస్థల పోరులో ముందుగా జరిగే పంచాయతీ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలన్నీ సర్వం సిద్ధం చేసుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది. అంతే గాక ఎన్నికల కమీషన్ నుంచే ప్రకటన వెలువడడంతో గ్రామాలల్లో పంచాయతీ ఎన్నికల హడావిడి మొదలైంది. ఈ ఎన్నికల ప్రకటనతో ఇప్పటికే అధికార కూటమి పార్టీలతో పాటు ప్రతిపక్ష వైసీపీ పార్టీ గ్రామాలల్లో పట్టు సాధించుకునే పనిలో నిమగ్నమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా .. ఇంత వరకు కోడుమూరు నియోజకవర్గంలోని ఎక్కడా కూడా ఉలుకు పలుకు లేని వైసీపీ పార్టీ నేడు పంచాయతీ ఎన్నికల ప్రకటనతో జనంలోకి వచ్చేందుకు ఉల్లి రైతుల అందోళనతో ఆ పార్టీ నేతల కదలికలు ప్రారంభమయ్యావనే చెప్పాలి. గత ఐదేళ్ల కింద జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ స్థానాలను అధిక శాతం వైసీపీ పార్టీ కైవసం చేసుకున్న విషయం విదితమే. అదే ఊపు , అదే .. చొరవతో త్వరలో జరిగే స్థానిక పోరులో కూడా అదే సత్తా చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగేందుకు పన్నాగాలు చేసుకుంటున్నట్లు సర్వత్రావ్యక్తం అవుతోంది. అయితే వైసీపీ ఎత్తుగడలను ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో చిత్తు చేసి అంతాటా పసుపు జెండాలను ఎగురవేయాలనే ఆలోచనల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ధీమాతోనే స్థానిక ఎన్నికల్లో వైసీపీని దెబ్బతీయాలనే ఆలోచనతో ఎన్నికలకు కూటమి పార్టీలన్నీ సర్వం సిద్ధం చేసుకునే పనిలో ఉన్నాయనేది తెలిసింది. ఇది ఇలా ఉంటే నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు పట్టణంలో ఉన్న వామ పక్ష పార్టీలు కూడా స్థానిక పోరుకు సిద్ధం అవుతున్నట్లు తెలుసో్తంది. అదే విధంగా స్వతంత్రులు కూడా ఈ సారి జరిగే ఎన్నికలల్లో వారి ప్రస్తావన ఉండాలనే ఆలోచనలు తెలుసో్తంది.

**కోడుమూరు పంచాయతీపైకి .. కొత్త వారి అరంగ్రేటంతో ప్రస్తావన ః** ఈ సారి జరిగే పంచాయతీ ఎన్నికలల్లో కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ స్థానానికి కొత్త వారి పరిచయంతో రాజకీయ ప్రస్తావనలు ఉంటాయనే ఉహాగానాలు తెరపైకి వస్తున్నాయి. అంతే గాక వారి రంగ ప్రవేశం ఎవరితో .. ఏ పార్టీతో ... మొదలు పెడతారనే విషయాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. వీరితో పాటు ఎప్పటిల్లాగే సుధీర్ఘ కాలంగా పంచాయతీ పోరు సాగించే మాజీలు కూడా ఈ సారి జరిగే పంచాయతీ ఎన్నికలకు తమ ప్రస్తావన ఉంటుందనే ఆలోచనలు చేస్తున్నట్లు వారికి చెందిన అనుచరవర్గాలు తెలియజేస్తున్నాయి. ఏది ఎమైన పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులు విడుదల చేసిన ప్రకటనతో అంతటా ఎన్నికల మాటలే వినిపించడం కొసమెరుపు.

## కుండపోత వర్షం

- జలమయమైన కాలనీలు
- నేలవాలిన చెట్లు, విద్యుత్ స్థంబాలు



**కొత్తపల్లె, సెప్టెంబర్ 11, ప్రభాతవార్తః**

మండలంలో అయా గ్రామాల్లో గురువారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. అయా గ్రామాల కాలనీలు జలమయం అయ్యాయి. గువ్వలకుంట్ల గ్రామం ఎస్సీ కాలనీలో నీళ్ల చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్ళలోకి నీరు చేరింది. కుండపోత వర్షానికి భారీ చెట్లు, విద్యుత్ తీగలపై పడడంతో ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అధికారులు స్పందించిన పడిపోయిన స్థంబాల స్థానంలో కొత్తస్థంబాలు వేసి విద్యుత్ పునరుద్దరించారు. వీరాపురం ఎస్సీ కాలనీలో, కొత్తపల్లి బీసీ కాలనీ, మెయిన్ బజార్ జలమయం అయింది. తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలోకి నీరుచేరి శివలింగం నీట మునిగింది. లింగాపురం ప్రధాన రహదారి జలమయం అయింది. నందికుంట నుండి ఆత్మకూరుకు వెళ్లె ప్రధాన రహదారిలో వర్షపునీరు నిల్వడంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న మొక్కజొన్న, పంటలు చేతికి అందేసమయంలో మరల వర్షానికి పూర్తిగా దెబ్బ తింటున్నాయని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.



# నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్**

**– జాతీయ రహదారి కోసం భూసేకరణ నిమిత్తం భూములను పరిశీలించిన సబ్‌కలెక్టర్**



**మంత్రాలయం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ;** నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం మంత్రాలయం, నందవరం మండలాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న నల్లవంక, దేరువంపు వంక ప్రాంతాలను అధికారులతో కలిసి సమీక్షించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా నది వంకల వద్ద నీటిమట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరమని, ప్రజలు ఎప్పటికప్పుడు అధికారుల సలహాలు పాటించలన్నారు. అనంతరం జాఈయ రహదారి కోసం భూసేకరణ నిమిత్తం భూములను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. చట్నీహళ్లి -కల్లుదేవకుంట వరకు ప్రతిపాదిత జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ అవసరమైన ప్రాంతాలను పరిశీలించారు. సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి భూసేకరణకు అనువైన స్థలాలను, సరిహద్దు ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయాశశఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీవర్షానికి నేలకొరిగిన మహావృక్షం

**ఉయ్యాలవాడ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త ః**



ఉయ్యాలవాడ మండలంలో ఉన్నటువంటి మాయలూరు గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న మహావృక్షం గత రాత్రి కురిసిన భారీ వర్షానికి నేలకొరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈవృక్షం నేలకొరగడం చేత జమ్ములమడుగు నుంచి కోవెలకుంట్లకు వెళ్ళే బస్సులు, లారీలు, మోటార్ సైకిళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోవడం జరిగింది. అందుచేత అక్కడ చాలసేపు వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈవిషయాన్ని గమనించిన అధికారులు అక్కడికి వెళ్లి రాకపోకలకు అంతరాయం కలుగకుండా యంత్రాల సహాయంతో వృక్షాన్ని తొలగించడం జరిగింది. సమస్యను వెంటనే పరిష్కరించినందుకు అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐటీఐ కళాశాల భవనానికి మరమ్మతులు చేయాలి

**– డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైన, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్**

**ఆలూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ;**




విద్యార్థులకు ప్రమాదకరంగా మారిన ఆలూరులోని ఐటీఐ తాత్కాలిక పురాతన భవనం పైకప్పుకు మరమ్మతులు చేయించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైన, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐటీఐ విద్యార్థుల దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వం చూడాలని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆలూరుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల 2008లో డ్రాప్ మెన్ సివిల్, ఎలక్ట్రిషన్, మెకానిక్ డీజిల్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్, డ్రస్ మేకింగ్, ఆరు ట్రేడ్లు ఏర్పాటు చేశారన్నారు. సొంత భవనాలు లేక ప్రభుత్వ ఉన్నత పాఠశాల-01లోని కొన్ని గదులను ఐటీఐ కళాశాలకు ఇవ్వడంతో ఈ భవనంలోనే నేటివరకు ఐటీఐ కళాశాల కొనసాగుతుందన్నారు. అయితే భవనాలు కూడా పురాతన భవనాలు కావడంతో భయం గుప్పిట్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. చిన్నపాటి వర్షం వస్తే తరగతి గదుల్లోకి వర్షపునీరు చేరి గదులు మొత్తం చిత్తడి చిత్తడిగా మారుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన ఐటీఐ కళాశాలకు సొంత భవనాల నిర్మాణాల కోసం నిధులు కేటాయించాలన్నరు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బసవరాజు, మండల సహాయ కార్యదర్శులు సురేష్‌వర్మ, శ్రీరామ్, మండల నాయకులు ఆఫ్టస్, సుధాకర్, డాకినాయక్, లోకనాయక్, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు మృతిచెందిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు పంపిణి

**ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త ః**



పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని జనసేన పార్టీ కోసం పనిచేసే క్రియాశీల కార్యకర్తలకు అండగా ఉంటుందని జనసేన భీమా కార్యకర్తలకు ధీమా అని ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ మండలంలోని బాచ్చాపురం గ్రామం ఆకుల పెద్ద శ్రీనివాసులు కుటుంబానికి అలాగే సిరివెళ్ళ మండలం గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన ముక్కమల్ల గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం ఏపీ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అందించిన భీమా చెక్కులను పంపిణి చేశారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తల మృతి బాధకరమని వారి సేవలు మరువలేనివన్నారు. జనసేన పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. పార్టీ అధినేత డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పార్టీ కార్యకర్తలకు క్రియాశీల సభ్యత్వం ద్వారా భీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారన్నారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. బాధిత కుటుంబ సభ్యులు డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ మైలేరి సురేఖ, రాచంశెట్టి వెంకసుబ్బయ్య, దేవా, ఆంజనేయులు, బావికాడి గుర్రప్ప, చైతన్య వెంకటరాముడు, గోవింద్, సురేష్, నరేంద్ర గౌడ్, చిన్నపెద్దయ్య, శ్రీనివాసులు, రామస్వామి, బాలయ్య పాల్గొన్నారు.

## ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

**నందికొట్కూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**




ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి శోభారాణి తెలిపారు. గురువారం స్తానిక పోలీసు అధికారులతో మరియు భార్ అసోషియేసన్ న్యాయవాదులతో జరిగిన సమీక్షా సమావేశంలో జడ్జి మాట్లాడుతు కక్షిదారులకు అవగాహన కల్పించి లోక్ ఆదాలత్ ద్వారా అప్పీలు లేని తీర్పును పొందవచ్చునన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు మరియు పోలీసు అధికారుల సహాకారం లేనిదే ఈ కార్యక్రమం విజయ వంతం కాదని అందుకే అందరు కలిసి చేయాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి రాహూల్ అంబేద్కర్ మాట్లాడుతు రాజీకి అర్హతమైన సివిల్ మరియు క్రిమినల్ తగాదాలను పరిష్కారిస్తామని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేసన్ అధ్యక్షులు వి.శశరబయ్య, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, డియస్పీ రామాంజి నాయక్, సి.ఐ.లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్.ఆర్చరీ క్రీడలకు కోట పాఠశాల విద్యార్థులు

**నందికొట్కూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**




ఈ నెల 11న కర్నూలు నగరంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన 69వ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలుర ఆర్చరీ సెలెక్షన్‌లో అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు నందికొట్కూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న డి.దేశావత్ దీపక్‌నాయక్, కె.సాయిచరణ్ ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య బాయి తెలిపారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతు దీపక్ నాయక్ రికర్వ్ విభాగంలోను, సాయిచరణ్ కాంపౌండ్ విభాగంలో ఎంపిక అయ్యారని వారు త్వరో శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినంధించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నిక..బలహీన వర్గాల విజయం

**నందికొట్కూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**



భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక బలహీన వర్గాల గౌరవానికి సంభంధించిన విజయమని బిజెపి ఓబీసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అశ్వినీకుమార్ తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మట్లాడుతు ఎస్సీ,ఎస్టీ,బీసి సమాజానికి దేశ అత్యున్నత పదవులలో ప్రాతినిధ్యం రావాలనే ఆకాంక్షలను బిజెపికి అవకాశం ప్రతిసారి నెరవేరుస్తున్నదని,అందుకే సకల జనుల పార్టీగా బిజెపిని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం ఉపరాష్ట్రపతి భాధ్యతలలోప్రధానమైనవని, కానీ కాంగ్రెస్ పార్టీ ఈ భాధ్యతల్నిరాజకీయ కోణాల్లో చూడటం భాధాకరమని, సామాజిక న్యాయం పట్ల నెహ్రూ కుటుంబానికి ఉన్న హేళన భావజాలాన్ని రాహూల్ గాంధీ కొనసాగిస్తున్నరని ఆయన తెలిపారు. చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ ఉపరాష్ట్ర పతిగా ఎన్నిక ద్వారా ఇది వికసిత భారత్‌వైపుకిఅడుగులు జోడిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి

**తుగ్గలి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**




పేద ప్రజల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ నియోజవర్గం ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తుగ్గలి మండలంలోని జొన్నగిరి గ్రామానికి చెందిన తలారి అశ్వినికిరూ.1,30,152, శంకరబండ నరసింహులుకు రూ.58,258 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు సి.ఎం.సహాయ నిధి భాధిత కుటంబానికి ఓ వరం లాంటిదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సి.ఎం.నారా చంద్రబాబునాయుడు పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. సర్పంచ్ ఓబులేషు, బీసీసెల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ, లక్ష్మణస్వామి, జయరాముడు, హోటల్ మల్లి, మీసాల శేఖర్ పాల్గొన్నారు.

## భక్త కనకదాసు విగ్రహాన్ని.. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**– టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మణేకుర్తి రాజశేఖర్, గ్రామ ఉప సర్పంచ్ చిన్నరంగన్న డిమాండ్**

**ఆలూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ;**



ఆలూరు మండలం మణేకుర్తి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాదాసి/మాదారి కురువ మాజీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మణేకుర్తి రాజశేఖర్, గ్రామ ఉప సర్పంచ్ చిన్నరంగన్న డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామంలో గొడవలు సృష్టించేందుకు కొందరు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కనకదాసు విగ్రహంపై దాడి చేసిన వారు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. విగ్రహానికి దాడికి పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ కులస్థులు నారాయణ, ఆంజనేయ, ఆగులూరి, దేవేంద్ర, అల్లప్ప పాల్గొన్నారు.

## పడమర ప్రాతకోటలో మద్దిలేటి నుండి 30 మద్యం బాటిల్స్ స్వాదీనం

**పగిడ్యాల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ;**



పగిడ్యాల మండల ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట సంతమార్కెట్టు వద్ద ఉన్న ఎంపియుపి పాఠశాల దగ్గర బుధవారం మధ్యాహ్నం పులికంటి మద్దిలేటి వద్ద నుండి 30 మధ్యం బాటిల్స్‌పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. బ్ర్యాంది -180 ఎంఎల్ క్వాటర్స్ బాటిల్స్‌ను నందికొట్కూరులోని వేరువేరు వైన్‌షాపుల వద్ద కొనుక్కొని వాటిని గ్రామములో అధిక ధరలకు అమ్ముతుండగా పులికంటి మద్దిలేటిని అరెస్టు చేసి అతని నుండి 30 మద్యం బాటిల్స్‌ను పంచనామాసి పోలీసులు స్వాదీనం పరుచుకున్నారు. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ నందు కేసునమోదు చేయడం జరిగిందనీ నందికొట్కూరు రూరల్ సిఐ టి.సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ శేషయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఆస్పరి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**



మండలంలోని గ్రామాలలో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడివో గీతావాణి తెలిపారు. గురువారం మండల పరిధిలోని బిల్లేకల్లు గ్రామంలో ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతు గ్రామంలో డ్రైనేజీ తీయించి గ్రీన్ అంబాషిడర్ ద్వారా ఇంటింటికితిరిగి చెత్తను సేకరించి వర్మీ కంపోస్టు కేంద్రానికి తరలించాలని పంచాయితీ కార్యదర్శిలను ఆదేశించారు. రోడ్లపై మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెంది ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం పడుతుందని తెలిపారు. ఎప్పటికప్పుడు పంచాయితీ అధికారులు గ్రామంలో తిరిగి డ్రైనేజీలో నీరు నిలువ లేకుండా శానిటేషన్ చేయించాలని, గ్రామాలలో శానిటేషన్ చేయడంలేదని ప్రజల నుండి ఫిర్యాదుల వస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు కూడా అధికారులకు సహాకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, ఏఈ మల్లికార్జు పాల్గొన్నారు.

## విప్లవ ధృవతార ఐలమ్మకు ఘన నివాళిలు

**నందికొట్కూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**



విప్లవ దృవతార తెలంగాణ సాయుధ రైతు పోరాటంలో దొరల పెత్తనానికి ఎదురొడ్డిపోరాడి తొలి భూ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ 40వ వర్ధంతి సంధర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వి.రఘురాంమూర్తి ఆధ్వర్యంలో కొవత్తులతో ఘనంగా నివాళిలు అర్పించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతు పోరాటినికి స్ఫూర్తినిచ్చిన వీర వనిత ధీశాలి ఐలమ్మ అని ఆమె స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ప్రజా సమస్యలపై గళమెత్తి పోరాడాల్సిన అవశ్యకతను వివరించారు,ఈ కార్యక్రమంలో వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ కొరముట్ల రవీంద్రబాబు, ఏఐటియుసి నాయకులు శంకర్‌నాయుడు, ఉస్మాన్‌బాష, ప్రతాప్ పాల్గొన్నారు.

## ఒక్కసారి వరివేస్తే ఆరు సార్లు కోత

**: 17దేశాలతో తమిళనాడు, ఒడిశాలో ప్రయోగాత్మక సాగుకు శ్రీకారం**

**నంద్యాల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ప్రతినిధి :**


ఒక్కసారి నాట్లు వేసి మూడేళ్లలో వరుసగా ఆరుసార్లు పంటకోసుకునే రోజులు రానున్నాయి.ఇలాంటి వరిని పెరెన్నియల్ రైస్(పిఆర్) అంటున్నారు. ఈ విలక్షల వరి వంగడాలను రూపొందించకున్న చైనా ఏడేళ్లుగా సాగుచేస్తోంది. ఉత్తత్తి ఖర్చులు 40శాతం తగ్గి నికరలాభం పెరుగుతుంది. పనిలో పనిగా భూసారం, జీవవైవిధ్యం కూడ పెరుగుతుంది. చైనా, తదితర దేశాల్లో ఏటేటా పిఆర్ వరి సాగు విస్తరిస్తోంది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్)దీనిపై తాజా గా దృష్టిసారించింది. ఫార్మింగ్ సిస్టం జర్నల్ తాజా సంచికలో భారతీయ వరిపరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్)శాస్త్రవేత్త డా.విజయకుమార్ షణ్ముగం రాసిన అధ్యయన పత్రం ఆధారంగా రాసిన ప్రత్యేక కథనం. ఖర్చులుపెరిపోవడం, ఆదాయం తగ్గిపోవడం, నీటిఅవసరాలు పెరగడం, భూసారం క్షీనించడం, హరిత గృహ వాయువులతో పర్యావరణానికి తీరని హాని జరుగడం, ఇవి ప్రస్తుతం మనదేశంలో వరి వ్యవసాయాన్ని వేధిస్తున్న సవాళ్లు. దాదాపు ఈ సమస్యలన్నింటికి ఏకకాలంలో చెక్‌పెట్టే అధ్భుతమైన పెరెన్నియల్ రైస్ వంగడం.

## పోలీసులు చట్టానికి.. అతీతులా..!

**(మొదటి పేజీ తరువాయి ) :** కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి నాగేంద్రుడు అనే ఒక నేరస్తునితో పాటు అతని అనుచరులను పోలీసులు జైలుకు పంపించారు. అయితే ఇదే కేసులో కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్లో పనిచేసే ఒక కానిస్టేబుల్ కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్లో పనిచేసే ఒక కానిస్టేబుల్ తో పాటు కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో పనిచేసే ఒక హోంగార్డు ఉన్నారని పోలీసులు గుర్తించారు. అయితే ఆ పోలీసులకు, హోంగార్డుకు కేవలం సస్పెన్షన్ మాత్రమే శిక్షగా ఇచ్చారు. మరి అసలు నేరస్తులను మాత్రం జైలుకు పంపారు. ఒకే రకమైన నేరం చేస్తే.. సాధారణ ప్రజలకు ఒక శిక్ష.. పోలీసులకు మరో శిక్ష ఉంటుందా.. అనే ప్రశ్న బహిరంగంగా వినిపిస్తుంది. ఇదే విధమైన ప్రేమికుల దోపిడీ కేసులో గతంలో ఒక కానిస్టేబుల్ ను సైతం రిమాండ్ కు పంపిన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం అప్పటి రిమాండ్ చట్టం ఇప్పటి పోలీసులకు పక్షపాతంగా మారింది. ఇక్కడ ఇంకో విశేషమేంటంటే ఇలాంటి వ్యవహారాల్లో ఇంకో ముగ్గురు నుంచి నలుగురు కానిస్టేబుళ్లు ఉన్నట్లు జరుగుతుంది. అయితే బాధితులు స్వయంగా బయటకు వచ్చి చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. మరి పోలీసులు మరింత లోతైన విచారణ జరిపితే మరి కొందరు దొంగ పోలీసులు బయటకు వస్తారు. ఏది ఏమైనా చట్టం అందరికీ సమానమే.. అనే విధంగా అధికారులు చర్యలు తీసుకొని.. నేరం చేసిన వారు పోలీసులైన శిక్ష తప్పదు.. అనే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మండలంలో భారీ వర్షం

**తుగ్గలి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**



మండలంలో బుదవారం రాత్రిభారీ వర్షం కురియడంతో పగిడిరాయి, జొన్నగిరి చెరువులు నిండి కడగొంబుద్వారా వరద నీరు బయటకు వెళ్తున్నాయి. వవారం రోజుల తరువాత వర్షం కురువడంతో ఈ వర్షం రైతులకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.. ముక్కెళ్ళ గ్రామంలో అరవబాబు అనే రైతుకు చెందిన ఎద్దు రేకుల షెడ్డులో విధ్యుత్‌షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన దాదాపు రూ.60 వేలు పైగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే రైతుకు పోన్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతును ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## ఆకాల భారీ వర్షానికి దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలి

**పత్తికొండ, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని హోసూరు గ్రామం మరియు పలు గ్రామాలలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. దాదాపు హోసూరు గ్రామంలోనే దాదాపు 10 వేల ఎకరాలలో ఉల్లి పంట విస్త్రీర్ణం సాగు చేశారని అంతా నీట మునిగాయని వారు తెలిపారు. ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని, రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఉల్లి పంటకుకనీస మద్దతు ధర 3 వేలు ప్రకటించాలన్నారు. ప్రస్తుతం రూ.1200 ప్రకటించడంతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగంపై ప్రత్యేక దృష్టిపెట్టి ఆదుకోవాలని వారు కోరారు.

## విద్యార్థులకు భక్తితో కూడిన జ్ఞానబోధ

**చాగలమర్రి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**




యూనివర్శల్ బ్రదర్ హుడ్ డే సందర్భంగా చాగలమర్రిలోని వాసవీ జూనియర్ కళాశాలలో రామకృష్ణ మిషన్ సెక్రటరీ స్వామి అనుపమనందజిమహారాజ్, విశ్రాంత హిందీలెక్చరర్ శివరామిరెడ్డి, యోగివేమన యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ రామసుబ్బారెడ్డి విద్యార్థులకు భక్తితో కూడిన జ్ఞానబోధ బోధించారు. గురువారం యూనివర్శల్ బ్రదర్ హుడ్ సందర్భంగా వివేకానంద అమెరికాలోని చికాగోలో ఇచ్చిన ప్రసంగం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు నైతిక విలువలు, జ్ఞానసముపార్జన, విద్య గురించి తెలియజేశారు. జూనియర్‌కళాశాల కరస్పాడెంట్ ఆర్‌వి.రమణ గుప్తా,డిగ్రీకళాశాల కరస్పాంట్ బడిగెంచుల రఘురామ్, పుల్లారెడ్డి, రామశేషయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వి.ఓబులేసు, వైస్‌ప్రిన్సిపాల్ వై.శివరామిరెడ్డి, విశ్రాంత లెక్చరర్ భగవాన్, లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియను కలిసిన నూతన ఎమ్మార్వోలు

**ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త ః**



ఉయ్యాలవాడ మండలం నూతన తహశీల్దార్‌గా నియమితులైన పి ప్రసాద్ బాబు, అలాగే రుద్రవరం మండలం నూతన తహశీల్దార్‌గా నియమితులైన జి చంద్రశేఖర్‌లు గురువారం ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియను తమ నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్చాలు అందించారు.

## భక్తకనకదాస్ విగ్రహం పగలగొట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

**ఆలూరు రూరల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**



ఆలూరు అంబేద్కర్ సర్కిల్ మదాసి మాదరి కురువసంఘం ఆధ్వర్యంలో మానేకుర్తి గ్రామంలో కురువల ఆరాధ్య దైవం భక్తకనకదాస్ విగ్రహం పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ధర్నా నిర్వహించి ఆలూరు ఎస్ఐ మహబుబ్ బషకు గురువారం వినతిపత్రం అందజేశారు. మదాసి మాదరి కురువసంఘం నాయకులు యస్‌కె.గిరి కమ్మరచేడు దేవేంద్రప్ప మాట్లాడుతూ మానేకుర్తి గ్రామంలో కురువల ఆరాధ్యదైవం భక్తకనకదాస్ విగ్రహం చెయ్యి పగల గొట్టడం వల్ల కురువల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉందన్నారు. భవష్యత్‌లో ఇలాంటి పునరావృతం కాకుండ చర్యలు తీసుకోవడంతో పాటు కనకదాస్ విగ్రహం పగలగొట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండు చేశారు. దేవేంద్ర, అయ్యాలప్ప, మల్లికార్జున, మహానంది, లింగనాగేంద్ర, మంగన్న, చంద్ర, ఉలేతప్ప, కురువ కులస్తులు పాల్గొన్నారు.


## దసరా ఉత్సవాలకు ప్రత్యేక అలంకరణలు - ఈవో

**మహానంది, సెప్టెంబర్ 11, ప్రభాతవార్తః**



దసరా ఉత్సవాలకు ప్రత్యేక అలంకరణలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో పూల అలంకరణ, విద్యుత్ అలంకరణ ఏర్పాట్లకు టెండర్లు నిర్వహించారు. ఇందులో పూల అలంకరణ చేసేందుకు 8 లక్షల 30 వేల రూపాయలకు జగన్ దక్కించుకున్నారు. విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేసేందుకు మణికంఠ ఏజెన్సీ 2 లక్షల 50 వేల రూపాయలకు దక్కించుకున్నారు. భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు ఉండాలని ఈవో తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈవో మధు, సూపరింటెండెంట్స్ నీలకంఠం రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

## మద్దిలేటయ్యలో చిన్నపాటి వర్షాలకు ఇరిగిపడుతున్న కొండచరియలు



**బేతంచెర్ల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్తః** ప్రముఖ వైష్ణవి పుణ్యక్షేత్రం శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహాస్వామి ఆలయం వెనుక ఉన్న కొండచరియలు చిన్నపాటి వర్షానికి ఇరిగిపడుతుండడంతో భక్తులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం భక్తులు ఏవరు లేనిసమయంలో కొండచరియలు విరిగిపడ్డాయి. పొరపాటున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వచ్చే రోజులైన శుక్ర, శనివారాల్లో అయితే ప్రమాదం జరిగి ఉండేదేమోనని అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేలా దేవాదాయశాఖ యంత్రాంగం చర్యలు చేపట్టి భక్తుల్లో మనోధైర్యాన్ని కల్పించాలని పలువురు కొరుతున్నారు.

# నిరుద్యోగుల ఆవేదన సదస్సును జయప్రదం చేయండి

: కె శ్రీనివాసులు

**కర్నూలు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త ప్రతినిధి :**



ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న విజయవాడలో జరిగే నిరుద్యోగుల ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిషన్న లు పిలుపునిచ్చారు. గురువారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు నిరుద్యోగుల ఆవేదనకు సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. శ్రీనివాసులు బీసన్న లో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక తీవ్ర గందరగోళంగా పరిస్థితి ఏర్పడిందని దీనికి కూటమి ప్రభుత్వమే కారణమని వారు విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రతి పక్షంలో ఉన్నప్పుడు వైసీపీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ హామీ ఇచ్చి తీరా అధికారం చేపట్టి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మోసం చేసిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 3.20 ప్రభుత్వ శాఖల పోస్టులు భర్తీ చేస్తామని అదేవిధంగా రాష్ట్రంలో సంపాద సృష్టించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడమే కాకుండా ఉద్యోగాలు ఇవ్వడం లేట్ అయితే ప్రతినెల 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి 15 నెలలు పూర్తయిన ఉద్యోగాల భర్తీ గురించి, నిరుద్యోగ భృతి గురించి ఏమాత్రం పట్టించుకోకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ అనే నినాదంతో ఆర్భాటాలు చేస్తున్నారే తప్ప నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని వారు మండిపడ్డారు. ఈనెల 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం నాయకులు ఒకరికి ఒకరు భజన చేసుకోవడం కాకుండా రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పైన చర్చించి వాటి నోటిఫికేషన్ వచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈనెల 17వ తేదీన ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో నిరుద్యోగుల ఆవేదన సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఈ సదస్సుకు కర్నూలు జిల్లా నుండి అధిక సంఖ్యలో యువతీ యువకులు నిరుద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బి నాగరాజు, నగర నాయకులు శ్రీకాంత్, సురేంద్ర యాదవ్, ప్రభాకర్, శ్రీనివాసులు, సూర్య మధు, మద్దిలేటి, పాల్గొన్నారు

## అంగన్‌వాడీ భువనేశ్వరిని వేధింపులకు గురిచేసిన ఆలూరు సిడిపిఓను సస్పెండ్ చేయాలి

**ఆలూరు రూరల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ఆలూరు మండలం కురవల్లి గ్రామ అంగన్‌వాడీ టీచర్ భువనేశ్వరిని వేధింపులకు గురిచేసి అస్వస్థతకు కారణమైన ఆలూరు సిడిపిఓను వెంటనే సస్పెండ్ చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ డిమాండు చేశారు. గురువారం వెంకటమ్మ, సిఐటియు జిల్లా నాయకులు కెపి.నారాయనస్వామి, హనుమంతులు అస్వస్థతకు గురైన అంగన్‌వాడీ టీచర్ భువనేశ్వరి ఇంటికి వెళ్లి పరామర్శించి అస్వస్థతకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లపై సిడిపిఓల వేధింపులు అధికమైనాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేకయాప్‌లవ్ల పని ఒత్తిడి పెరిగి తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. దీనికి తోడు సిడిపిఓలు చిన్న లోపాలను సాకుగా చూపి అంగన్‌వాడీ టీచర్లపై వేధింపులకు గురిచేయడం మామూలు అయిపోయిందన్నారు. ఆలూరు సిడిపిఓ మామూళ్ల మత్తులో తీవ్రమైన అవినీతిలో కూరుకుపోయిందని, మామూళ్లు ఇస్తే సరే, లేకపోతే సెంటర్లకు వెళ్లి మామూలు వసూలు చేసే పరిస్థితి ఉందని ఆరోపించారు. ఈ విషయం ఆలూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ తెలుసన్నారు. మంగళవారం జరిగిన సెక్టార్ సమావేశంలో భువనేశ్వరి పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేయడం వల్ల భువనేశ్వరి అక్కడే కుప్పకూలిపోయిందన్నారు. అయినా సిడిపిఓ నరసమ్మ అంగన్‌వాడీ టీచరు పట్ల ఏమాత్రం సానుభూతి లేకుండ నిర్లక్ష్యంగా పట్టనట్లుగా తన వాహనంలో వెళ్లిపోయిందన్నారు. తన కార్యకర్తల పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. అంగన్‌వాడీ టీచరు తన విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదని సక్రమంగా ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నదన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. ఇప్పటికైనా ఐసిడిఎస్ జిల్లా అధికారులు స్పందించి సమగ్రమైన విచారణ జరిపి ఆలూరు సిడిపిఓ నరసమ్మను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు. ఆలూరు ప్రాజెక్టు పరిధిలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండ చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు ఆలూరు మండల నాయకులు కృష్ణ, రమేష్, పాల్గొన్నారు.



## ఆర్ఓఆర్ కేసులో ఇరువర్గాల ఘర్షణ

- తహసీల్దార్ కార్యాలయంలోనే గొడవకు దిగిన వైనం - ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయతీ

**మంత్రాలయం, సెప్టెంబరు11, ప్రభాతవార్త;** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల రైతులు ఆర్ఓఆర్ కేసులో పరస్పరం ఘర్షణ చేసుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు చూస్తుండగానే ఈ గొడవ జరిగింది. ముగ్గురు రైతులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం పంచాయతీ మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వివరాల మేరకు.. మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కురువ వీరేశమ్మ, గోవిందు, రంగన్న తదితర రైతులకు సౌలహళ్లి గ్రామంలో పొలాలు ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం జరిపిన రీ సర్వేలో ఈ రైతులకు చెందిన పొలాలు కొంత మేరకు నర్సారెడ్డి, నరసన్న, ఈరన్న అనే రైతులకు ఆన్‌లైన్‌లో ఎక్కింది. కావునా రైతులు రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్ది ఇతర రైతుల పేరుమీద ఎక్కిన భూములను మా పేరుపై ఎక్కించాలని ఆగస్టు నెలలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారులు గురువారం ఇరువర్గాల రైతులతో మాట్లాడాలని తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. అధికారులు ఇరువర్గాల రైతులను ఒకేసారి విచారణ జరపడంతో రైతులు ఆవేశానికి లోనై పరస్పరం దాడులు చేసుకున్నారు. రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘర్షనలో ముగ్గురు రైతులకు స్వల్ప గాయాలయ్యాయి. రెవెన్యూ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల రైతులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే రెవెన్యూ అధికారులు విజ్ఞతతో ఆలోచించి ఓ వర్గం రైతులను ఒకరోజు, మరో వర్గం రైతులను మరో రోజు పిలిపించి విచారణ జరిపి ఉంటే ఈ ఘర్ష జరిగేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.



## ఎఫ్ఆర్ఓ కాంప్లెక్సులో జాతీయ అమరవీరుల దినోత్సవం

**రుద్రవరం ,సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**

రుద్రవరం ఎఫ్ఆర్ఓ కాంప్లెక్సులో గురువారం జాతీయ అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. అటవీ అధికారుల త్యాగాలు ,సేవలను గుర్తు చేసుకుంటూ రుద్రవరం ఎఫ్ఆర్ఓ ముర్తుజావలి సమక్షంలో అటవీ అమరులకు రేంజ్ సిబ్బంది ఘననివాళుల ర్పించారు. అటవీ, వన్యప్రాణుల నిర్వహణలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎఫ్ఆర్ఓ సిబ్బందికి సూచించారు. ఎఫ్ఎస్ఓలు ఎన్.శ్రీనివాసులురెడ్డి, మక్తర్‌బాష, రాణెమ్మ, మాబుఖాన్, రామక్రిష్ణ, ఎఫ్‌బిఓలు జేమ్స్‌పాల్, సురేంద్రగైడ్, నాగహుస్సేనయ్య, నరసింహారెడ్డి, మదన్‌గోపాల్, పాల్గొన్నారు.





## విధులు నిర్వర్తిస్తున్న ఆర్ అండ్ బి అధికారిపై దాడి

: మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**కర్నూల్ హాస్పిటల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** కర్నూలు పట్టణంలోని బి క్యాంప్ ప్రాంతంలో ప్రభుత్వ విధులను నిర్వర్తిస్తున్న ఆర్ అండ్ బి అధికారిపై దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.సెప్టెంబర్ మూడవ తేదీ సాయంత్రం సుమారు 8 గంటల 15 నిమిషాల సమయంలో బి క్యాంప్ అరోరా నగర్, విజ్ఞాన మందిరం సమీపంలోని మొదటి లైన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ క్వార్టర్స్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలనే పై అధికారుల ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆర్.వి. రమణ ఆటోలో మైక్ ద్వారా ప్రకటనలు చేస్తూ తిరుగుతుండగా ముందస్తు పథకం ప్రకారం కొందరు మహిళలు పురుషులతో కలిసి తను వెళ్తున్న ఆటోను అడ్డగట్టి "ఇది మా ఇల్లు, మమ్మల్ని ఎవరు ఖాళీ చేయలేరు" అంటూ వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత ఆగ్రహంతో ఆటోలో ఉన్న మైక్ సెట్‌ను బయటకు తీసి పగులగొట్టారు. అంతటితో ఆగక గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి రమణ తలకు గాయపరచగా, మరికొందరు కాళ్లతో, చేతులతో కొట్టి కిందపడేశారు. దాడి నుండి తప్పించుకున్న రమణ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం, కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధి నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన జమీలా, సునీత మరియు ఇతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.దాడి చేయడం హేయమైన చ ర్యకిరణ్ ఆర్ అండ్ బి అసోసియేషన్ జనరల్ సెక్రటరీ విధులు నిర్వర్తిస్తున్న మా ప్రెసిడెంట్ ఆర్ వి రమణ పై కక్ష పూరితంగా దాడి చేయడం పిరికి పందల చర్య అని ఇది తన వ్యక్తిగత విషయం కాదని ప్రభుత్వ అధికారుల ఆజ్ఞలు పాటిస్తే దాడి చేసి గాయపరచడం చాలా బాధకరమని దాడి చేసిన జమీల సునీత మరియు మిగతా వారిపై నాన్ బెయిలబుల్ కేసులు కట్టి జైలుకు పంపించాలని లేదంటే మా అసోసియేషన్ తరపున మా ఉద్యోగులు అందరం ఉద్యమిస్తామని ఆయన తెలియచేశారు.



## విద్యార్థులు తమ లక్ష్యం పైనే దృష్టి సాధించాలి..

**పాణ్యం, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

విద్యార్థులు తమ లక్ష్యం పైనే దృష్టి సారించాలని హైదరాబాదు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత పేర్కొన్నారు. గురువారం శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బేసిక్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఐ.ఎస్.టి.ఈ స్టూడెంట్స్ చాప్టర్ ఏపీ 133 సహకారంతో హౌ టూ చూజ్ ది రైట్స్ పాత్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నచిన్న కలలతో ఆగిపోరాదని పెద్దకలలను కనాలన్నారు టెస్ల వ్యవస్థాపకుడు మస్క్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఒకే పనిపై 20 నిమిషాలు దృష్టిని కేంద్రీకరించి చిన్న విరామం తర్వాత మళ్లీ అదే ఉత్సాహంతో కొనసాగితే విజయం తప్పదన్నారు. జీవితంలో గొప్ప విజయాలు సాధించాలంటే మనకు మనమే ప్రేరణగా నిలవాలన్నారు. సాధారణ కుటుంబం నుంచి ప్రారంభించి రాయలసీమలో అనేక విద్యాసంస్థలను స్థాపించి వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించిన డాక్టర్ శాంతి రాముడు స్ఫూర్తిదాత అన్నారు. ఆయన కృషి వల్ల నిరుద్యోగం తగ్గి శాంతి, అభివృద్ధి నెలకొన్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం, హెచ్ ఓ డి డాక్టర్ శేషయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండవీడు ఎక్స్‌ప్రెస్ బేతంచర్లలో నిలపడం హర్షం

**బేతంచర్ల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**



పారిశ్రామిక కేంద్రం అయిన బేతంచర్ల రైల్వేస్టేషన్ కరోనా కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్ళ నిలుపుదలను ఆపేసిన రైల్వేశాఖ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుతూ ఉత్తర్వులు జారీచేయడంపై సిపిఐ, ఎస్టీయు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మండల కార్యదర్శి భార్గవ్, ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఆజాం బేగ్‌లతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు పట్టణ వాసులు రైల్వేస్టేషన్ చేరుకొని స్టేషన్ మాస్టర్‌కు, లోకో పైలెట్లకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. సిపిఐ, విద్యార్థి సంఘాల నాయకులు దస్తగిరి, ఉదయ్, ప్రదీప్ తదితరులున్నారు.

## రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు

- తహసీల్దార్ లక్ష్మీనారాయణ

**హాలహర్వి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త;**

రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చౌకదుకాణ డీలర్లు ప్రతినెలా రేషన్‌కార్డు లబ్ధిదారులకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతినెలా 1 నుంచి 10వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్నారు. చౌకదుకాణ డీలర్లు రేషన్ బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా రేషన్‌ను పక్కదారి పట్టిస్తే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే గ్రామంలో ఎవరైనా కార్డుదారుల నుంచి రేషనన్‌బియ్యం కొనుగోలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎహచ్చరించారు. అలాగే కార్డుదారులు రేషన్ బియ్యం అమ్మితే చర్యలు తీసుకోవడమేగాకుండా రేషన్‌కార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు.



## భారీగా అక్రమ మద్యం పట్టివేత

**కోడుమూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

కోడుమూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు మండలం మల్లాపురం గ్రామ బస్ స్టాప్ దగ్గర గురువారం గోవా,కర్ణాటక ప్రాంతాలకు చెందిన అక్రమ మద్యంను తరలిస్తున్న వారిపై కర్నూలు ఎక్సైజ్ ఎ.ఇ.ఎస్ రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడిలో అక్రమ మద్యాన్ని రవాణ చేస్తున్న పర్ల గ్రామానికి చెందిన చింతకాల రమేష్,మల్లాపురం గ్రామానికి చెందిన చిన్నమిన్నెల్లా,కల్లూరి గ్రామానికి చెందిన తలారి క్రిష్ణలను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో వారి వద్ద ఉన్న 30 గోవా మద్యం బ్యాటిల్స్,16 కర్ణాటకకు చెందిన మద్యం బ్యాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాదీనం చేసుకున్న అక్రమ మద్యంను కోడుమూరు ఎక్సైజ్ పోలీస్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సి.ఐ ముదుములగుర్తి మంజుల తెలిపారు.



## 16న వాహనాల వేలం

- రూ.3 వేలు ధారాత్తం చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలి - ఎక్సైజ్ సీఐ సైదుల్

**ఆదోనిటౌన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ;**

ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 16వ తేదీన స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వేలం పాటల్లో పాల్గొనే వారు ధారావత్తు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. ఈనెల 16న ఉదయం 10 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎక్సైజ్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.



## మధ్యాహ్నభోజన పథకాన్ని తనిఖీ చేసిన పుడ్‌కమీషన్ మెంబర్

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**

కోవెలకుంట్ల పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్ పుడ్ కమీషన్ మెంబరు గంజిమాలాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఎపి పుడ్ కమీషన్ మెంబర్ గంజిమాలాదేవి కోవెలకుంట్ల పట్టణంలో ఉన్న బాలికల ఉన్నతపాఠశాలలో కరిమద్దెల దుర్గ సారధ్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనపథకాన్ని తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా ఈ పాఠశాలలోని బాలికలకు మంచి ఆహారాన్ని అందిస్తున్నారని కితాబునిచ్చారు. మధ్యాహ్నభోజన పథక నిర్వాహకురాలు దుర్గను కమీషన్ మెంబరు గంజిమాలాదేవి శాలువ కప్పి సన్మానించారు. డిప్యూటీ ఇంచార్జి డిఇఓ వెంకటరామిరెడ్డి, ఎంఇఓ వెంకటసుబ్బయ్య, పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## వేంపేంటలో మహిళ గుండెపోటుతో మృతి

-నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి మాజీ సర ్పంచ్

**పాములపాడు రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**



వేంపెంట గ్రామంలో సి.జ్యోతి (32) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ టెకూరి రామసుబ్బమ్మ, సింగపూర్ తెలుగు సమాజం వైస్ ప్రసిడెంట్ టెకూరి నాగేశ్వర్‌రావుల అదేశాల మేరకు తెలుగుదేశం నాయకులు నివాళ్లు అర్పించి వారి తరుపున రూ.5 వేలు ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటారని ధైర్యం ఇచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోయనపల్లి సత్యరాజు, మాజీ ఎంపిటిసి శివకుమార్, సుబ్బరావు, చిన్నస్వామి, ఆచారి, వినయ్, మధు, నాగేశ్వర్‌నాయక్, యువరాజు, ప్రసాద్, భాస్కర్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో వ్యక్తికి గాయాలు

**దేవనకొండ, సెప్టెంబరు 11, ప్రభాతవార్త;**

మండలంలోని కప్పట్రాళ్ల బస్‌స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరివేముల గ్రామానికి చెందిన తలారి పశుల రోగన్న(61) ఆయన కుమారుడు వీర గోపల్ సొంత ఆటోలో టమాటా పంట ఉత్పత్తులను కోడుమూరు మార్కెట్‌లో అమ్ముకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కప్పట్రాళ్ల గ్రామ బస్‌స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి పశుము రోగన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుమారుడు వీరగోపాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకేరాత్రి 9 ఇళ్ళల్లో ఛోరీ - ఆందోళనలో ప్రజలు

**బేతంచర్ల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**

ఎప్పుడు కనివీని ఎరుగని రీతిలో ఒకే రాత్రి ఒకే గ్రామంలో గుర్తుతెలియని దుండగులు 9 ఇళ్ళలో చోరీకి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకున్నట్లు తెలిసింది. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో వడ్డె అరుణ, రాజశేఖర్, మరో ఏడు మంది ఇళ్ళలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. అయితే మూడు ఇళ్ళల్లో నగదు, నగలు, ఇతర సామాగ్రిని దొంగలించుకుపోయినట్లు తెలుస్తోంది. మిగిలిన 6 ఇళ్ళల్లో తాళాలు పగలగొట్టి ఛోరీకి యత్నించినా తమవి ఏమి వస్తువులు పోలేదని బాధిత కుటుంబాలు వెల్లడిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. ఈసంఘటన మండలంలోని ప్రజలకు ఆందోళన కలిగిస్తుంది.



## గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించిన డీఎస్పీ

**గోనెగండ్ల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**



గాజులదిన్నె ప్రాజెక్టును ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి గురువారం సాయంత్రం సందర్శించారు. ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు జీడీపీ అధికారులు సన్నద్ధం అవుతుండటంతో డీఎస్పీ సందర్శించి ప్రాజెక్టులో ఎంత నీరు ఉంది,ప్రాజెక్టు నీటి నిలువ శాతం ఎంత ప్రస్తుతం నీరు ఎంత ఉంది ఇంకా వరద ద్వార ఎంత నీరు చేరుతుందని జీడీపీ డీఈ సుబ్బరాయుడిని అడిగితెలుసుకున్నారు. హంద్రీ పరివాహక ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.తమ పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుంతని తెలిపారు.ఆమె వెంట గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ ,సిబ్బంది ఉన్నారు.

## గ్రీవెన్స్‌డేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆలూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ;**

హొళగుంద మండల కార్యాలయంలో శుక్రవారంనాడు ప్రత్యేక గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయలలిత, తహసీల్దార్ నిజాముద్దీన్ తెలిపారు. కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్, ఆదోని సబ్‌కలెక్టర్ వారి అధ్యక్షతన గ్రీవెన్స్‌డే న్విహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేస్తే సహించం..

: ఈ దాడి మా జాతికే అవమానం : విగ్రహ ధ్వంసం పై మండిపడ్డ కురవ సంఘం నాయకులు

**ఆదోని రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**

ఆలూరు నియోజకవర్గంలో మనేకృతి గ్రామంలో నిన్న రాత్రి కనకదాసు విగ్రహంపై ధ్వంసం చేసిన అకంతు కులను పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని రాష్ట్ర టీడీపీ బీసీ కురువ సాధికారిత కమిటీ డైరెక్టర్, ఆదోని కురవ సంఘం మండల అధ్యక్షులు చాగి.మల్లికార్జున రెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లికార్జున కురువ సంఘం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ ఈ విగ్రహం చేయడం మా జాతికే అవమానం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భక్త కనకదాసు కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి కుల దైవం అయినటువంటి కనకదాసు విగ్రహ ధ్వంసాన్ని మీము అభిమానించే ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లుగా భావిస్తున్నామన్నారు. విగ్రహాన్ని మా కుల దైవమైనటువంటి కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను, వెంటనే పోలీసులు గుర్తించి అలాంటివారిని తక్షణమే చర్యలు తీసుకొని శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రహదంశం చేసిన వాళ్ళనీ శిక్షించడమే కాక, వారిచే ఆ స్థానంలోనూతన విగ్రహాన్ని చేపట్టేలా చేరలు తీసుకోవాలని చెప్పి డిఎస్పి వెంకటరమణ, కోరడం జరిగింది. కురువ సంఘం కులస్తులు జిల్లా నాయకులు మండల డివిజన్ గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



## నేడు ఎమ్మెల్యే గ్రీవెన్స్

**పాములపాడు రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

పాములపాడు ఎంపీడిఓ కార్యాలయం నందు నేడు ఎమ్మెల్యే గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడివో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుక్రవారం పాములపాడు మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమంలో పాల్గొని అనంతరం 11 గంటలకు ఎంపీడిఓ కార్యాలయం నందు ఎమ్మెల్యే గ్రీవెన్స్‌లో పాల్గొని అందిన ఫిర్యాదులను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరిస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## సాదాసీదాగా మండల సర్వసభ్యసమావేశం

**రుద్రవరం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**

మండలకేంద్రంలోని మండలపరిషత్ సమావేశభవనంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపిపి మబ్బుబాలస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయాశాఖలకు చెందిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. ఇంచార్జి ఎంపిడిఓ సుబ్రమణ్యం సమావేశాన్ని ప్రారంభించిన అనంతరం ఆయాశాఖలకు చెందిన పలువురు అధికారులు వారి ప్రగతినివేదికలను చదివి వినిపించారు. ఇంచార్జి ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాలం పరిస్థితులను అనుసరించి పారిశుద్ధ్యం, తాగునీరు, మధ్యాహ్నభోజనంపై అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పిఆర్ఎఇ కమాల్‌సాహెబ్, సీనియర్ అసిస్టెంట్ షఢ్రక్‌బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుబ్రమణ్యం, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్,రీసర్వే డిప్యూటీ తహశీల్దారు మహమ్మద్‌రఫీ, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.





# నిండుకుండలా.. గాజులదిన్నె ప్రాజెక్టు..!

- జీడీపీలో3.54 టీఎంసీలు నీరు
- గోనెగండ్ల,కోడుమూరు,కల్లూరు,కర్నూలు అధికారుల అప్రమత్తం



**గోనెగండ్ల,సెప్టెంబరు,11,ప్రభాతవార్త**
జిల్లాలో ఎమ్మిగనూరు,డోన్,కోడుమూరు,పత్తికొండ ప్రాంతాల రైతుల జీవనాడి అయిన గాజులదిన్నె ప్రాజెక్టు వరద నీరు చేరుతుండటంతో కళకళ లాడుతుంది. గురువారం తెల్లావారుజామున కురిసిన వర్షం కారణంగా జీడీపీకి వరద నీరు వచ్చి చేరుతుంది. గురువారం సాయంత్రంకు జీడీపీలో 3.54 టీఎంసీల నీరు ఉన్నట్లు జీడీపీ ఇరిగేషన్ డీఈ సుబ్బరాయుడు తెలిపారు.హంద్రీనీవా నుంచి రోజుకు 120 క్యూసెక్కల నీరు విడుదల అవుతుంది.ఎల్లెల్సీ నుంచి 30 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి చేరుతుంది.జీడీపీ ప్రస్తుతం నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు,ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర,తుగ్గలి,పత్తికొండ,రాతన,తదితర ప్రాంతాలలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురియడంతో హంద్రీ నదికి వరద పోటెత్తింది. ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు.

**-గోనెగండ్ల, కోడుమూరు, కల్లూరు, కర్నూలు అధికారులు అప్రమత్తం :** గాజులదిన్నె ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతుండటం ప్రస్తుతం ప్రాజెక్టులోకి 3.54 టీఎంసీల నీరు చేరింది.గురవారం రాత్రి,శుక్రవారం తెల్లవారుజామున కురిసే వర్షంను బట్టి గేట్లు ఎత్తి నీటి విడుదల చేయాల్సి ఉంటుందని జీడీపీ డీఈ సుబ్బరాయుడు తెలిపారు. హంద్రీ పరివాహక ప్రాంతాలైన గోనెగండ్ల,కోడుమూరు, కల్లూరు, కర్నూలు మండలాల తహశీల్దార్, పోలీసులకు ముందస్తు సమాచారాన్ని జీడీపీ అధికారులు ఇచ్చారు.హంద్రీ పరిసర ప్రాంతాలలోని పంట పొలాలలో రాత్రి పూట రైతులు ఉండరాదని పొలాలలో పంట కోసుకొని ఉంటే ఇంటికి తీసుకుపోవాలని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలుసుతున్నారు.ఆయా గ్రామాలలో దప్పు వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిసింది.ప్రాజెక్టుకు ఉన్న ఆరు గేట్లలో ఐదు క్రష్టగేట్లు పనిచేస్తున్నాయని రెండో నెంబరు క్రష్టగేటు పనిచేయడం లేదు.దాన్ని మర్మత్తు చేయాల్సి ఉంది.కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా గత మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరితే అన్ని గేట్లు పనిచేయక పోతే ఇబ్బంది పాడాల్సి వస్తుందని మండల ప్రజలు రైతులు విమర్శిస్తున్నారు.

# డ్రోన్ ప్రదర్శనపై ఒక గ్రామంలో డెమో చేయండి : జిల్లా కలెక్టర్

**కర్నూలు, హాస్పిటల్ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**
కర్నూలు ట్రిపుల్ ఐటీ డిఎం విద్యా సంస్థ ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని డెమో చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన క్యాంప్ కార్యాలయంలో ట్రిపుల్ ఐటీ డిఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ కు సంబంధించిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు ట్రిపుల్ ఐటి డిఎం ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను రూపొందించడం పూర్తి అయిన నేపథ్యంలో ఒక గ్రామంలో డెమో ప్రదర్శన.చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు.



ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోను రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి, వైద్య సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందని కలెక్టర్ తెలిపారు..ఈ వ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర హెచ్చరికలు, గ్రీన్ ఛానల్ సమయంలో అంబులెన్స్ కు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థను రూపొందిస్తున్న ట్రిపుల్ ఐటీ డిఎం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె కృష్ణ నాయక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. రవికుమార్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు,రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి ఖాసిఫా అంజుమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ గా బి విజయకుమార్ బాధ్యతలు

: ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ గా విగ్నేష్ అపావో





**ఆత్మకూరు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**
నల్లమల్ల అటవీ ప్రాంతంలోని ఆత్మకూరు అటవీ డివిజన్లో డీఎఫ్ఓగా విధులు నిర్వహించి రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు రాజమండ్రి అటవీశాఖ అకాడమీలో డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న బి విజయకుమార్ ను శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేయడం జరిగింది ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్లో 2010 సంవత్సరంలో అటవీ శాఖలో డీఎఫ్ఓగా విధులు నిర్వహించి పర్యావరణం పెద్దపులి సంరక్షణ చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా బైర్లూటీలో ఏకో టూరిజం తోపాటు అడవి సంరక్షణ కోసం బేస్ క్యాంపులు ఏర్పాటుచేసి ఎంతోమంది అడవి బిడ్డలకు ఉపాధి అవకాశాలు కల్పించి నేడు మళ్ళీ తిరిగి శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ గా బి విజయకుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సాయిబాబాను తిరుపతికి బదిలీ చేయగా ఆయన స్థానంలో ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ గా విగ్నేష్ అపావోను నియమించడం జరిగింది రాష్ట్రంలో అటవీ శాఖలో జరిగిన బదిలీలలో శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు పరిధిలో ఫీల్డ్ డైరెక్టర్ బి.ఎన్ మూర్తి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లారు ఈ స్థానంలో విజయ్ కుమార్ ఎఫ్ డి పి టి గా నియమించడం జరిగింది

# ప్రతి పౌరుడు ఓటు హక్కు పొందాలి..!



**కర్నూలు కార్పొరేషన్. సెప్టెంబర్ 11. ప్రభాత వార్త.**
కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ పి. విశ్వనాథ్.. రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ చూపాలిప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ సూచించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫారం 6, 7, 8లను వినియోగించుకోవాలని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.అలాగే త్వరితగతిన బూత్ ఏజెంట్ల జాబితాను సమర్పించాలని, ఈ ప్రక్రియలో ఆలస్యం చేయవద్దని ఆయన సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం అందరి బాధ్యతగా కమిషనర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

# నందమూరినగర్‌ను మంత్రి ఫరూక్ దత్తత తీసుకోవాలి



**నంద్యాల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**
నంద్యాల పట్టణశివారుప్రాంతమన నందమూరినగర్‌ను నంద్యాల జిల్లా మంత్రి ఎన్ఎండి.ఫరూక్ దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ కోరారు. నందమూరినగర్‌లోని రహదారులన్నీ వర్షపునీటితో బురదగా మారి అక్కడి ప్రజలు ఇబ్బందులకు గురవుతుండగా నందమూరినగర్ సిపిఐ శాఖ కార్యదర్శి హుస్సేనా, సహాయకార్యదర్శి ఓబులేసు, నాయకులు ఖాన్ ఖలీల్ ఇక్బాల్, తదితరుల ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం 1983లో అధికారంలో ఉన్నప్పుడు నందమూరినగర్ ఏర్పాటైందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అభివృద్ధి శూన్యమన్నారు. అలాగే 8 అడ్డరోడ్లు, సిసిరోడ్లు చిన్నపాటి వర్షానికి మోకాళ్లలోతు వర్షపునీటిలో, బురదలో, విషపురుగులతో, దోమలతో, తేళ్ల మధ్య ప్రజలు జీవించవలసి వస్తున్నదన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారు కాని మౌలిక వసతులు మరిచారన్నారు. మంత్రి ఫరూక్ మా బాధలు పట్టించుకుని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# తెలుగు వారికి ఎక్కడ ఆపద అంటే అక్కడ టిడిపి ఉంటుంది : ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

**నందికొట్కూరు,సెప్టెంబరు 11,ప్రభాతవార్త:**
తెలుగు వారికి ఎక్కడ ఆపద అంటే అక్కడ వారిని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని నియోజకవర్గం శాసనసభ్యులు గిత్తా జయసూర్య అన్నారు. గురువారం అల్లూరులో విలేకర్లతో మాట్లాడుతు నేపాల్‌లో రాజకీయ సంక్షోభంతో జరిగిన మారణహోమంలో మన రాష్ట్ర ప్రజలు దాదాపు 200 పైగా చిక్కుకొని తీవ్రభయభ్రాంతులకు లోను అయ్యారు, వారిని కాపాడేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంత్రి లోకేష్ అనంతపురం సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని రద్దు చేసుకొని సచివాలయానికి చేరుకుకొని అక్కడ రియల్‌టైం గవర్నెన్స్ సెంటర్ వార్ రూమును కమాండ్ కంట్రోల్‌రూమ్‌గా మార్చి తెలుగు ప్రజలకు సహాయ చర్యలను వేగవంతంగా ఆయన



చేపట్టారన్నారు. వివిధ కార్యక్రమాలపై వెళ్ళిన తెలుగువారితో గంట గంటకు మాట్లాడుతు మీకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంది ఎవరు ఆందోళనకు గురి కావద్దని అందరిని క్షేమంగా సొంత ఊర్లకు చేరుస్తామని వారిలో మనోధైర్యం నింపుతు వారు ఎక్కడెక్కడ చిక్కుకున్నారో లోకేషన్ కో-ఆర్డీనేటర్లతో సహా మ్యాప్ సిద్దం చేయించి వారు సురక్షిత ప్రాంతాలలో ఉండేలా సలహాలు సూచనలు ఇస్తూ మరో వైపు ఢిల్లీలోని ఏపి భవన్‌లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం, అల్లర్లలో చిక్కుకొని తలదాచుకున్న తెలుగు ప్రజలకు ఆహారం నీరు వసతి సదుపాయాలు కల్పించేలా మంత్రి నారా లోకేష్‌బాబు కృషిచేస్తు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం పాటిస్తూ ఆపదలో ఉన్న వారిని సురక్షితంగా రక్షించడానికి లోకేష్ పక్కా వ్యూహంతో తెలుగువారు భారత్ చేరుకునేందుకు కీలక పాత్ర పోషించారని, దీంతో తెలుగువారు తమ సొంత ప్రాంతాలకు చేరుకున్నారని, తమ ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న భాధ్యతను మంత్రి లోకేష్‌బాబు చాటి చెప్పారని, ఇది మాకు ఎంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

# గ్రేడింగ్ చేసిన ఉల్లికి మద్దత్తు ధర-ఆదోని సబ్ కలెక్టర్

**గోనెగండ్ల,సెప్టెంబరు, 11, ప్రభాతవార్త**
గ్రేడింగ్ చేసిన ఉల్లి పంటకు మార్కెట్‌లో మద్దత్తు ధర లభిస్తుందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. గురువారం సాయంత్రం గోనెగండ్ల మండలంలోని వేముగోడు గ్రామంలో రైతులు పండించిన ఉల్లి పంటను ఆయన పరిశీలించారు. రైతుల నుంచి పంట సాగు ఉత్పత్తి అమ్మకాలు పై వివరాలు తెలుసుకున్నారు.అలాగే పండిన పంటలో ఉల్లి నాణ్యతను పరిశీలించారు.ఆయన రైతులతో మాట్లాడుతూ పంట కాలం పూర్తి అయిన తరువాతనే కోత కోయాలని పరిమితి చెందని వాటిని కోత చేయడం వల్ల నష్టం వాటిల్లుతుందన్నారు.ప్రభుత్వం ఉల్లి పంటను కేజి రూ.12లకు కొంటుందని తెలిపారు.గ్రేడింగ్ చేయని ఉల్లి దూరప్రాంతాలకు సరఫరా చేసేలోపే కుళ్లి పోతుందన్నారు.



శని,ఆదివారాలలో కర్నూలు ఉల్లి మార్కెట్ కు సెలవులు కావడంతో తాగేపల్లి గూడెంలో కూడా ఉల్లి కి మద్దత్తు ధర లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరి,ఏవో హేమలత,ఉద్యనవనశాఖ అధికారిణి శ్రీవాణి, సంబందిత అదికారులు,రైతులు పాల్గొన్నారు.

# వాగులో చిక్కుకున్న.. ఆర్టీసీ బస్సు

- నిలిచిపోయిన రాకపోకలు
- సురక్షితంగా డ్రైవర్, కండక్టర్, ప్రకయాణకుడు
- భారీ వర్షంతో పొంగిపొర్లిన వంకలు

**మంత్రాలయం, సెప్టెంబరు11, ప్రభాతవార్త;**
గత రాత్రి నుంచి భారీగా కురిసిన కుండపోత వర్షానికి వంకలు, వాగులు పొంగి పొర్లాయి. గురువారం ఉదయం మంత్రాలయం నుంచి నాగలదిన్నెకి వెళ్లే రోడ్డులో భారీ వర్షానికి ధరివంపు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. మంత్రాలయం నుంచి కొట్టాలకు విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. మార్గమధ్యలో ఉన్న ధరివంపు వాగు వరద ఉదృతికి రోడ్డుపై బురద చేరి ఉండడంతో బస్సు మధ్యలో చిక్కుకుంది. బస్సులో ఉన్న కండక్టర్, డ్రైవర్, ఓ ప్రయాణికుడు సురకక్షతంగా బయటపడ్డారు. ఈ బస్సు మార్గమధ్యలో చిక్కుకోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నాగలదిన్నె, ఐజ, కర్నూలు వెళ్లే రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



# యూరియా అంశంలో వైసీపీ కుటిల రాజకీయం.. : మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి..

## : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత

**నంద్యాల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ప్రతినిధి**
కూటమి ప్రభుత్వం రైతు అనుకూల, రైతు సంక్షేమ ప్రభుత్వం.. రైతుల అభ్యున్నతే అజెండాగా మా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తున్నప్పటికీ, ప్రతీ అంశాన్ని రాజకీయం చేసి, ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుని, కుటిల వైసీపీ పనిచేస్తోందని మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. నాడు 5 ఏళ్ల అధికారంలో ఉండగా, తాడేపల్లి ప్యాలెస్ దాటిరాని, పరదాల చాటున దాక్కున్న జగన్ మోహన్ రెడ్డి నేడు రైతుల కష్టాలు అంటూ సరికొత్త డ్రామాకు తెరతీస్తున్నారు. అధికారంలో ఉండగా కనీసం రైతులకు సాగు నీరందించే పంట కాలువల్లో పూడికలు తీయని వైసీపీ నేడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉంది.. యూరియా అంశంలో వైసీపీ కుటిల రాజకీయం రాష్ట్రంలో ఎరువుల సరఫరా అంశంలో తొలుత కొన్ని చోట్ల సమస్యలు తలెత్తిన మాట వాస్తవం.. అదే సమయంలో తక్షణమే ప్రభుత్వం స్పందించి, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తూ వచ్చింది.. ముఖ్యంగా యూరియా కేటాయింపులు, సరఫరాపై స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారంటే కూటమి ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్దికి నిదర్శనం.. అయితే వైసీపీ నేతలు మాత్రం క్షేత్రస్థాయిలో యూరియా కొరత అంశాన్ని భూతద్ధంలో చూపడంతో, రైతుల్లో ఒకింత ఆందోళనకు కారణమైంది.. దీంతో కొంత మంది రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయడం కూడా కృత్రిమ కొరతకు దారితీసింది. ప్రభుత్వం తొలి రోజు నుంచి యూరియా సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోంది. కానీ ఈ అంశాన్ని తమ రాజకీయ అవసరాలకు వినియోగించుకోవడమే లక్ష్యంగా తన కరపత్రిక, వైసీపీ సోషల్ మీడియాలో ఆ పార్టీ నేతలు దుష్ప్రచారం చేశారు. గతేడాది కంటే అదనంగా ఈ ఏడాది 1.04 మెట్రిక్ టన్నుల వినియోగం రాష్ట్రంలో ఒక్క ఖరీఫ్ సీజన్ కే 6.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం కేటాయించింది.. అయితే రాష్ట్రంలో రైతులు సీజన్ మొదలయ్యే నాటికే ఎక్కువ మొత్తంలో యూరియా కొనుగోలు చేశారు. మొత్తంగా ఇప్పటి వరకూ రాష్ట్రంలోని రైతులు 6.11 లక్షల



మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించారు. గత ఏడాది సెప్టెంబర్ 10 వ తేదీ నాటికి రాష్ట్రంలో 5.06 లక్షల టన్నుల యూరియాను కొనుగోలు చేయగా ...ఈ ఏడాది ఇప్పటి వరకు 6.11 లక్షలు టన్నుల యూరియా కొనుగోలు చేశారు. అంటే అదనంగా 1.04 లక్షల టన్నుల యూరియా ఎక్కువ రైతులు కొనుగోలు చేశారు.. ఒక్క యూరియానే కాదు, డిఎపి వంటి ఇతర ఎరువులు కూడా గత ఏడాది కంటే 20 శాతం అధికంగా రైతులు కొనుగోలు చేసిన విషయం ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 80,503 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. మరో 10 రోజుల్లో మరో 30 వేల టన్నుల యూరియా రాష్ట్రానికి రాబోతుంది.

# నిలిచిన.. రాకపోకలు..

**పాణ్యం సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**
గురువారం తెల్లవారుజామున నుండి కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి పొంగిపోయినాయి మండలంలోని ఒడ్డుగండ్ల రసూళ్ల పేట గ్రామాల మధ్య కావేరి వాగు ఉధృతంగా ప్రవేశించడంతో గ్రామంలోకి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు కొద్దిపాటి వర్షం వస్తే ఇండ్లలోనే ఉండవలసి వస్తుంది అధికారులు మాత్రం చూచుచున్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చిన అధికారులు మాత్రం స్పందించడం లేదు ఇప్పటికైనా చుట్టుపక్కల కంపచెట్లు తొలగించి బ్రిడ్జిని ఎత్తుగా నిర్మించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు



# ఆపద వచినా.. వారిని ఆదుకోవడంలో తెలుగుదేశం ప్రభుత్వం ముందు ఉంటుంది

: నేపాల్ లో చిక్కుకున్న ప్రజలను సురక్షితంగా తీసుకురావడానికి మంత్రి లోకేష్ చేసిన కృషి అభినందనీయం
: ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రపంచం వ్యాప్తంగా ఉన్న రాష్ట్ర ప్రజలకు ఎప్పుడు ఎక్కడ ఆపద వచ్చినా వారిని ఆదుకోవడానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందు ఉంటుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు... నేపాల్ లో జరుగుతున్న మారనోమంలో రాష్ట్ర ప్రజలు చిక్కుకున్నారన్న విషయం తెలియదగానే మంత్రి నారా లోకేష్ అఘామేఘాల పై స్పందించిన తీరు అభినందనీయమన్నారు..రియల్ టైం గవర్నెన్స్ వార్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు బాధితులతో మాట్లాడుతూ సహాయక చర్యలు అందించారన్నారు.. బాధితులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంలో తీవ్రంగా కృషి చేసిన లోకేష్, తమ ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను చాటి చెప్పారన్నారు.. గతంలోనూ చంద్రబాబు, లోకేష్ లు ఉత్తరాఖండ్ వరదల్లో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయన రాష్ట్ర ప్రజలను రాష్ట్రానికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు...ఇక ప్రభుత్వం పై పదే పదే విమర్శలు చేసే వైసీపి అధినేత జగన్, నేపాల్ లో రాష్ట్ర ప్రజలు చిక్కుకుంటే కనీసం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు

# గూడూరులో కుండపోతగా వానలు



**గూడూరు,సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**
గూడూరు మండలంలో గురువారం ఉదయం మూడు గంటల పాటు కుండపోతగా వానలు కురిసాయి. దీంతో మండల పరిధిలోని వాగులు,వంకలు పొంగి పొర్లాయి. అంతే గాక మండలంలోని పెంచికలపాడు గ్రామం దగ్గర ఉన్న కాజ్‌పై భారీగా వర్షం నీరు రావడంతో ఈ మార్గాన వెళ్లే రాక పోకలు మధ్యాహ్నం వరకు పూర్తిగా స్థంభించి పోయ్యాయి. అంతే గాక గూడూరు పట్టణంలో పలు కాలనీలు జలమయ్యం అయ్యాయి. అధికంగా కురిసిన వర్షం నీరంతా ఇళ్లలోకి ప్రవేశించడంతో జనజీవం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని పడమర బి.సి కాలనీలల్లో మురికీ కాల్వలపై వాన నీరంతా భారీగా రావడంతో ప్రజల అవస్థలు అన్నీఇన్నీ కావు. ఈ విషయంను తెలుసుకున్న నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పి.ఎస్ అస్లాం,కౌన్సిలర్ ఖలీల్ భాషలు వెంటనే యుద్ధప్రాతిపదికనగా ఆయా కాలనీలల్లో ఇబ్బందులు కలిగిస్తున్న ప్రాంతాలలో నీరు వెళ్లేందుకు జె.సిపిలతో పనులు చేపట్టారు. అలాగే తూర్పు బి.సి కాలనీల్లో కూడా భారీ వర్షంతో ప్రజలు అల్లాడి పోయ్యారు.

# తెలుగువారికి అండగా మంత్రి నారా లోకేష్

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



**ఆత్మకూరు సెప్టెంబర్11ప్రభాతవార్త :**
ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఎప్పుడు ఎక్కడ ఆపద వచ్చినా ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందన్న విషయం నారా లోకేష్ ద్వారా మరోసారి స్పష్టమైందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేపాల్‌లో చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి మంత్రి లోకేశ్ తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే బుడ్డా ప్రశంసించారు. నేపాల్లో తెలుగువారు చిక్కుకున్నారని తెలిసిన మరుక్షణమే అనంతపూర్ పర్యటన రద్దు చేసుకుని ఆగమేఘాల మీద అమరావతికి వచ్చి ఆఖరి ప్రయాణికుడి వరకు స్వస్థలాలకు తీసుకువచ్చే బాధ్యతను మంత్రి లోకేష్ తీసుకోవడం హర్షించతగ్గ విషయమన్నారు.

# వైసీపీ రాష్ట్ర జనరల్ సెల్ సెక్రెటరీగా జెడ్డు శ్రీనివాసరెడ్డి

**ఆత్మకూరు సెప్టెంబర్11 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో పార్టీ జెండా మోసిన నాయకులను గుర్తుంచుకొని శ్రీశైలం నియోజకవర్గం లోని ఆత్మకూరు పట్టణానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు జెడ్డు శ్రీనివాసరెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర సెల్ సెక్రెటరీగా అవకాశం కల్పించింది ఈ సందర్భంగా జడ్డు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నాపై నమ్మకం ఉంచి రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ పార్టీలో అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ పెద్దల ఆదేశాలతో నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన శ్రీశైలం నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు 2029 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు నాపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు స్నేహితులకు రాష్ట్ర వైసీపీ పెద్దలకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు